నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 20 వరకు జిల్లా వ్యాప్తంగా 57వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. వారం రోజుల పాటు బాలలకు చిత్రలేఖనం తదితర పోటీలు, పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



నేత్రపర్వం.. తెప్పోత్సవం

- ఇంద్ర, శ్వేత పుష్కరిణిల్లో విహరించిన ఆదిత్యుడు, కూర్మనాథుడు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

కార్తీకమాసం, క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి, శ్రీకూర్మం శ్రీకూర్మనాథుని తెప్పోత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఆదిత్యుడు ఇంద్ర పుష్కరిణిలో, కూర్మనాథుడు శ్వేతపుష్కరిణిలో హంస వాహనాలపై విహరించారు. నేత్రపర్వంగా సాగిన ఈ తెప్పోత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించారు. అనంతరం ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు.

6లో

నాట్య మయూరీలు

- కూచిపూడిలో రాణిస్తున్న జిల్లా విద్యార్థినులు
- జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు
- ఎన్నో అవార్డులు సొంతం

జిల్లాలోని పలువురు విద్యార్థినులు నృత్య, ఆటపాటల పోటీల్లో రాణిస్తున్నారు. పాతపట్నం మండలానికి చెందిన శ్రేయమిశ్రా, ఆమదాలవలస మండలానికి చెందిన కూన శ్రీలత కూచిపూడిలో అందెవేసిన కళాకారులుగా పేరొందారు. నాట్య మయూరీలుగా గుర్తింపుపొందారు. అలాగే ఆమదాలవలసకు చెందిన అభిసాత్విక వ్యాసరచన, వక్తృత్వం, డ్యాన్స్, క్విజ్ పోటీల్లో అదరగొడుతోంది. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా వారిపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

వైకల్యాన్ని అధిగమించి.. నాట్యంతో అలరించి..

పాతపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని జర్నలిస్టు కాలనీకి చెందిన శ్రేయమిశ్రా అనే విద్యార్థిని కూచిపూడిలో అందెవేసిన కళాకారిణిగా పేరుపొందింది. ప్రత్యేకావసరాలు గల ఈ విద్యార్థిని తన తల్లిదండ్రులు ఎస్పీ మిశ్రా, పద్మావతిల ప్రోత్సాహంతో వైకల్యాన్ని అధిగమించి కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. ఇప్పటికే జాతీయస్థాయిలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 2022 డిసెంబరు 3న ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా శ్రేష్ఠబాలిక జాతీయ అవార్డును పొందింది. 2023 ఫిబ్రవరిలో కేరళలో జరిగిన పోటీల్లో ప్రతిభను కనబరచి సమ్మోహనం అవార్డును అందుకుంది. 2023లో తెలంగాణ ప్రభుత్వం నుంచి స్ఫూర్తి అవార్డు, 2024లో విజయనగరం జిల్లా కలెక్టర్ వి.నాగలక్ష్మి నుంచి స్టూడెంట్ ఐ కాన్ ఆఫ్‌ది ఇయర్ అవార్డు అందుకుంది. అలాగే, ఇంటర్నేషనల్ అచీవర్స్ పురస్కారంతో పాటు వివిధ సంస్థల నుంచి నాట్య సిరి, నాట్య ఊర్వశి, నర్తనబాల వంటి బిరుదులను సొంతం చేసుకుంది.



నాట్యం చేస్తున్న శ్రేయమిశ్రా (ఫైల్)

పేదింటి బిడ్డ.. నృత్యంలో దిట్ట..

ఆమదాలవలస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పట్టణానికి చెందిన కూన శ్రీలత అనే బాలిక కూచిపూడిలో రాణిస్తోంది. తల్లిదండ్రులు షణ్ముఖరావు, విజయనిర్మల పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో చిన్నపాటి పాన్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. తల్లి ప్రోత్సాహంతో శ్రీలత నృత్యంపై దృష్టిసారించింది. ప్రస్తుతం కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలోని శ్రీనివాసులు వద్ద కూచిపూడిలో ఎంపీఏ చేస్తోంది. తిరుపతి, శ్రీశైలం, అన్నవరంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో, జిల్లాలోని మందస, అరసవల్లి ఆలయ ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. ఉగాది సందర్భంగా ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్ర యూత్ ఫెస్టివల్ నృత్య ప్రదర్శనలో మొదటి స్థానం సాధించింది. ఉగాది పురస్కారంతో పాటు విశిష్ట నాట్య కళా కౌస్తుభ అవార్డును అందుకుంది. ఈ ఏడాది జనవరి 26న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో శ్రీలత నృత్య ప్రదర్శన చేసి సిక్కోలు కీర్తిని ఇనుమడింపజేసింది. తమ్ముడు సాయి కృష్ణ, హిందీ ఉపాధ్యాయుడు మందపల్లి రామకృష్ణారావు ప్రోత్సాహంతో తాను ఈస్థాయికి చేరుకున్నట్టు శ్రీలత తెలిపింది.



నృత్యం చేస్తున్న కూన శ్రీలత(ఫైల్)

ఆటపాటల్లో 'అభి'నయం



మెడల్, ప్రశంసాపత్రంతో అభిసాత్విక

ఆమదాలవలస మండలంలోని తోటాడ పరిధి కొత్తరోడ్ జంక్షన్‌కు చెందిన దుగ్గివలస అభిసాత్విక చదువుతో పాటు వ్యాసరచన, వక్తృత్వం, డ్యాన్స్ క్విజ్ పోటీల్లో అదరగొడుతుంది. అభిసాత్విక.. నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. తల్లిదండ్రులు దుగ్గివలస రాంప్రసాద్, భవానీ ఉపాధ్యాయులు. అభిసాత్విక చిన్నతనం నుంచే చదువు, ఆటపాటల్లో చురుగ్గా ఉండడంతో తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. యూకేజీ నుంచి చదువుతో పాటు పాటలు, డ్యాన్స్, డిబేట్, క్విజ్ వంటి పోటీల్లో రాణిస్తూ అనేక పతకాలు, జ్ఞాపికలు సాధించింది. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షల్లో మూడు బంగారు పతకాలు పొందింది.

కిడ్నీ బాధితులూ.. జాగ్రత్త!

- చలికాలంలో అప్రమత్తంగా ఉండాలి
- లేదంటే ఆరోగ్య సమస్యలు తప్పవు
- హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు
- ఆహార నియమాలు పాటించాలని సూచన



పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం, ఆసుపత్రి

పలాస, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చలికాలం ఉద్దానం కిడ్నీ రోగుల పాలిట ప్రాణసంకటంగా మారుతోంది. పొగమంచు, తీవ్ర చలిగాలులకు డయాలసిస్ బెడ్లపై ఉన్న కిడ్నీ రోగుల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. చలి ప్రారంభమైన కేవలం నెల రోజుల్లో పలాస రెవిన్యూ డివిజన్‌లో పదుల సంఖ్యలో కిడ్నీ బాధితులు మృతి చెందడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. చలిపై కిడ్నీ బాధితులకు అవగాహన లేకపోవడం, దాన్ని అంచనా వేయకపోవడంతోనే మరణాలు సంభవిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒక్క ఈ కాలంలో కాస్త జాగ్రత్తలు తీసుకుంటే డయాలసిస్‌తో కిడ్నీ రోగుల మరణాల నుంచి బయటపడవచ్చని వైద్యాధికారులు అంటున్నారు.

25 వేల మందికి పైగా బాధితులు..

ఉద్దానం ప్రాంతమైన పలాస రెవెన్యూ డివిజన్‌లోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, నందిగాం మండలాల్లో 25వేల మందికి పైగా కిడ్నీ బాధితులు ఉన్నారు. కొన్ని తీరప్రాంత గ్రామాల్లో ప్రతీ ఐదుగురిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఉద్దానంలోని పరిస్థితిపై ఆందోళన చెందాయి. వ్యాధి మూలాలు కనుగోవాలని శాస్త్రవేత్తలను ఆదేశించడంతో పాటు అందుకు తగిన నిధులు కూడా సమకూర్చారు. వ్యాధి తీవ్రతను గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వం కిడ్నీ బాధితులకు ఉచిత రవాణా, వైద్య సౌకర్యం, డయాలసిస్, ఉచిత మందులు, పింఛన్లు కూడా అందించింది. అప్పటి సీఎం చంద్రబాబు పలాసలో పీపీపీ పద్ధతిపై కిడ్నీ ఆసుపత్రి, పరిశోధన కేంద్రానికి శంకుస్థాపన కూడా చేశారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం పలాసలో రూ.80 కోట్ల వ్యయంతో డాక్టర్ వైఎస్ఆర్ కిడ్నీ ఆసుపత్రి, పరిశోధన కేంద్రం నిర్మించింది. ప్రస్తుతం అందులో ఒక నెఫ్రాలజిస్ట్‌తో పాటు వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు. గ్లోబల్ ఇనిస్టిట్యూట్ అనే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రైవేటు సంస్థ మూడు నెలలుగా కిడ్నీ వ్యాధిపై సర్వే నిర్వహిస్తోంది. విదేశీ సహకారంతో శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధనలో భాగస్వామ్యం పంచుకుంటోంది. ప్రస్తుతం వ్యాధి మూలాల అన్వేషణలో వారు ఉన్నారు.

ఉద్దానంలో చలి ఎక్కువ..

ఉద్దానం ప్రాంతం జీడి, మామిడి, కొబ్బరి తోటలకు ప్రసిద్ధి. ఇక్కడ వేల ఎకరాల్లో ఈ తోటలు ఉన్నాయి. ఏ గ్రామంలో చూసినా పచ్చని చెట్లే కనిపిస్తాయి. సముద్రతీరం కూడా ఎక్కువే. దీంతో శీతాకాలంలో చలి ఎక్కువగా, వేసవిలో ఎండ తక్కువగా ఉంటుంది. ఈ కారణంగా కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో వ్యాధి తీవ్రత సహజంగా ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఆహార అలవాట్లు మార్చుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, వేకువజాము 3 గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఇంటి నుంచి బయటకు రావద్దని అంటున్నారు. ఈ సమయంలో బయట తిరిగితే ఆయాసం, మంట, కళ్ల ఉండడం, ఊపిరితీసుకోవడం కష్టంగా ఉంటుంది. లంగ్ ఇన్‌ఫెక్షన్ పూర్తిగా ఉంటుంది. దీన్ని గుర్తించి అవసరమైన చికిత్స చేసుకోవాలి. దగ్గువచ్చి ఆయాసం ఉంటే నెఫ్రాలజీ వైద్యాధికారులను తక్షణం సంప్రదించాలి. ఆర్ఎంపీ, సొంత వైద్యం దీనికి పనికిరాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

● దాహం తీర్చుకోవడానికి నిమ్మకాయ ముక్కలను నోటిలో పెట్టుకొని ఉండాలి. నిమ్మరసం తాగాలి. ● నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ పళ్లను తోముకోవాలి. ● పెదాలను హైడ్రేట్‌గా ఉంచడం. ● డయాబెటీస్ ఉంటే దాహం తగ్గించడంలో సహాయపడడానికి మీ రక్తంలో చెక్కెరశాతాన్ని అదుపులో ఉంచుకోవాలి. ● పొటాషియం అధికంగా ఉండే ఆహారాన్ని నివారించాలి. ● నల్లద్రాక్ష, స్ట్రాబెర్రీ వంటి గడ్డకట్టిన పండ్లు తీసుకోవాలి. ● నీరు తాగడానికి చిన్నకప్పు మాత్రమే వినియోగించాలి.

సోడియం తక్కువగా తీసుకోవాలి..

● గుడ్డులోని తెల్ల సొన, చేపలు, చికెన్, స్కిన్‌లెస్ గ్రిల్డ్‌ను ఉప్పు వినియోగించకుండా తీసుకోవచ్చు. రుచి కోసం తాజా మూలికలు, సుగంధ ద్రవ్యాలు వేసుకోవాలి. ● కూరగాయల నుంచి అదనపు సోడియం తొలగించడానికి వాటిని మంచినీళ్లలో కడిగి ఉడికించి తినాలి. ● ఊరగాయలు, అప్పడాలు, బేకరీ ఐటమ్స్, స్నాక్ చేసిన పదార్థాలకు దూరంగా ఉండాలి. ప్రతిరోజూ 3 గ్రాములకు మించి ఉప్పు తీసుకోకూడదు. ● బంగాలదుంప, బచ్చలికూర, అరటిపండ్లు తీసుకోవడం తగ్గించాలి. ● యాపిల్, పైనాపిల్, జామ, బొప్పాయి, పుచ్చకాయ, మామిడి, పొట్లకాయ, దోసకాయలు తక్కువ మోతాదులో తినొచ్చు. పాలు, పాల ఉత్పత్తులను రోజూ 300 గ్రాములకు పరిమితం చేయాలి.

చలికాలం ఇబ్బందే..



కిడ్నీ బాధితులకు చలికాలం ఇబ్బందికరమే. వారికి వేకువజామున దగ్గువస్తే మాత్రం తక్షణం వైద్యాధికారులను సంప్రదించాలి. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ వస్తుంది. ఆయాసం, కఫం వస్తుంది. కనీసం నడవడానికి వీలులేకుండా పోతుంది. వెంటనే అటువంటి వాటిని గుర్తించి వైద్యుల సలహా మేరకు మందులు వినియోగించాలి. చలిని తట్టుకోవడానికి వేడి పదార్థాలతో పాటు వేడినీరు తీసుకోవాలి. ఐస్‌క్రీమ్ పూర్తిగా నిషేధించాలి.

-డాక్టర్ రాకేష్, నెఫ్రాలజిస్ట్, కిడ్నీ పరిశోధన కేంద్రం, పలాస



డయాలసిస్ చేయించుకోవడానికి వచ్చిన కిడ్నీ బాధితులు

జిల్లాను మాదకద్రవ్య రహితంగా మారుద్దాం

- ఎస్పీ మహేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జిల్లాలోని వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, డీజీపీ ఆదేశాల మేరకు గంజాయి, మహిళలు, చిన్నపిల్లలపై వేధింపులు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. 'గత మూడు నెలల్లో జిల్లాలో భారీ స్థాయిలో గంజాయి స్వాధీనం చేసుకున్నాం. కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశాం. చిన్నపిల్లలు, మహిళలపై ఇటీవల వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా 15-16ఏళ్ల బాలికలను కొంత మంది వ్యక్తులు ప్రేమ పేరుతో ప్రలోభాలు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారు. ఫేస్ మార్ఫింగ్, ఓటీపీల పేరుతో జరిగే సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గంజాయి ఇతర మత్తు పదార్థాల నివారణకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంకల్పం పేరిట పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. జిల్లా పోలీసు శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందించాలి. సమాజానికి పెను సవాల్‌గా మారిన మత్తు పదార్థాలు, సైబర్ మోసాలను పూర్తిస్థాయిలో నిర్మూలిద్దాం' అని ఎస్పీ అన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఉమెన్ పోలీసు స్టేషన్ డీఎస్పీ రాజశేఖర్, సీఐలు ఇమాన్యుయల్ రాజు, శ్రీనివాసరావు, అంబేడ్కర్ యూనివర్సిటీ నోడల్ అధికారిణి డా.సంధ్య, జిల్లా ఒకేషనల్ కోర్సు అధికారి బి.తవిటినాయుడు, వెంకటేశ్వర విద్యా సంస్థల ప్రిన్సిపాల్ పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య ఉండగా భయమెందుకు?

- ఎక్కడైనా పాము కనిపిస్తే ఆయనకే ఫోన్
- దాదాపు ఐదువేల సర్పాలు పట్టుకున్న వైనం
- అడవుల్లో క్షేమంగా వదిలిపెడుతున్న బాలయ్య

6లో



అయినను.. మారలేదు!

- రైతుసేవా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లకు మారని పేరు
- పాత పేర్లతో భవనాల కొనసాగింపు.. మారని రంగులు

6లో



సభలో మనోళ్ల గళం

- గంటపైగా మాట్లాడిన కూన రవికుమార్
- ప్రజాసమస్యలు లేవనెత్తిన గౌతు శిరీష

శాసనసభ సమావేశాల్లో బుధవారం జిల్లా ఎమ్మెల్యేలు పలు సమస్యలపై మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలు, కుంభకోణాలపై కూన రవికుమార్ ధ్వజమెత్తగా.. జిల్లాలో ఐటీడీఏ మంజూరు చేయాలని గౌతు శిరీష కోరారు.



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో బుధవారం ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గంటకు పైగా బడ్జెట్‌పై ప్రసంగించారు. అదేస్థాయిలో 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనపై విరుచుకుపడ్డారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని గత ప్రభుత్వం విస్మరించడంపై ఆయన విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వ పాలనలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించిన తీరును, నాడు-నేడులో కుంభకోణాలను వివరించారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు.. మద్యం, ఇసుక మాఫియా, భూకబ్జాలలో మునిగితేలారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు.

శిరీష ఏం మాట్లాడరంటే..

పలాస, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఐటీడీఏ మంజూరు చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. బుధవారం అమరావతి అసెంబ్లీ సమావేశంలో శిరీషకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడడానికి అవకాశం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ 2014-19లో టీడీపీ పథకాలు పేరుమార్చడం తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు ఏవీ లేవన్నారు. సంపూర్ణ పోషణ్ పథకానికి ముందు వైఎస్ఆర్ పేరు పెట్టి దాన్ని నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. పలాస, పాతపట్నంలో గిరిజన మండలాలు అనేకంగా ఉన్నాయని, ఐటీడీఏ ఎత్తివేయడంతో గిరిజనుల అభివృద్ధి కుంటుపడిందని, ఐటీడీఏను జిల్లాలో మళ్లీ ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

బాలయ్య ఉండగా భయమెందుకు?


కింగ్‌కోబ్రాను పట్టుకున్న బాలయ్య (ఫైల్)

- ఎక్కడైనా పాము కనిపిస్తే ఆయనకే ఫోన్
- దాదాపు ఐదు వేల సర్పాలు పట్టుకున్న వైనం
- అడవుల్లో క్షేమంగా వదిలిపెడుతున్న బాలయ్య

సోంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోంపేటకు చెందిన బాలయ్య.. ఈయన్ను అందరూ పాముల బాలయ్య అంటారు. జనావాసాల మధ్య పాము కనిపించిందంటే చాలు.. తొలుత ఆయనకే ఫోన్ చేస్తారు. బాలయ్య అక్కడకు చేరుకుని పామును ఒడిసిపట్టుకుని క్షేమంగా అడవుల్లో విడిచిపెడుతున్నాడు. ఈయనకు గ్రామపంచాయతీ కొంత స్థలాన్ని కేటాయించింది. ఇందులో ఆయన చిన్నవ్యాపారం చేసుకుంటూ పాములను పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నతనంనుంచి పాములను పట్టడం అలవాటుగా చేసుకున్నాడు. అనంతరం విషపూరిత పాములను సైతం చాకచక్యంతో పట్టుకుని వాటికి హాని కలగకుండా అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేవాడు. అలా పాములను పట్టడం వృత్తిగా మార్చుకున్నాడు. ఇంట్లో, పాఠశాలల్లో, పొలాల్లో, కార్యాలయాల్లో.. ఎక్కడ విష పూరిత పాము ఉన్నా అక్కడకు బాలయ్య రావాల్సిందే. ఇలా చేయడంతో సంబంధిత వ్యక్తులనుంచి కొంతమొత్తం స్వీకరిస్తాడే తప్ప ఇంతకావాలని డిమాండ్ చేయడు. ముఖ్యంగా మహేంద్రగిరులు, మెట్టలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో పాములు ఎక్కువగా బయటకు వస్తుంటాయి. సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు ప్రాంతాలకు కూడా బాలయ్య వెళ్లి పాములను పట్టి క్షేమంగా విడిచిపెడుతున్నాడు.



పాములు తనంతటతాను హానిచేయవు: రెల్ల బాలరాజు

ఎంత విషపూరిత పాములైనా తనంతట తానుగా అవి ఎవరికీ హాని చేయవు. కానీ వాటికి హాని కలిగిస్తున్నారని భావిస్తే మాత్రం కాటువేస్తాయి. మనిషికంటే పాములకే ఎక్కువ భయం. మనుషులుండే చోటుకు మామూలుగా అవిరావు. ఏదో దారితప్పి జనారణ్యంలోకి వస్తాయి. అప్పటికీ మనుషుల చప్పుడుకు పారిపోతాయి. అయినా వాటి వెంటపడుతుంటాం. అలాంటప్పుడు అవి కరుస్తుంటాయి. పొలాల్లో కూడా ఇదేపరిస్థితి. పాములు కాటేసిన చోట బ్లేడుతోగాని చాకుతోగానీ కోసి విషాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తా. గత 25సంవత్సరాలుగా పాములను పడుతున్నా. ఇన్నేళ్లలో ఒక్కపామును కూడా చంపలేదు. పాములను పట్టుకుని మహేంద్రగిరుల్లో విడిచిపెడుతుంటాను. అతి ప్రమాదకరమైన కింగ్ కోబ్రాను కంచిలి మండలం బొగాబణిలో పట్టుకున్నా. సోంపేటలోని మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాను. పంచాయతీ వారు నివాసం ఉండేందుకు స్థలాన్ని ఇచ్చారు. ఆస్థలంలో కూరగాయలు అమ్ముకుంటూ.. మరోవైపు పాము ఉందని సమాచారం వస్తే వాటి పట్టుకునేందుకు వెళ్తాను. పాము తలభాగాన్ని చాకచక్యంగా పట్టుకుంటే ప్రమాదం ఉండదు. అయితే కొన్నిసార్లు పాముకాటుకు గురయ్యాను. అయినా ఈవృత్తిని కొనసాగిస్తున్నాను. ఇప్పటివరకు సుమారు 5000 వరకు పాములను పట్టుకుని సురక్షితంగా విడిచిపెట్టాను.



ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెరగాలి

- ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి
- తోటూరు తీరంలో సముద్రానికి విష్ణుహారతి

వజ్రపుకొత్తూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెరగాలి. పిల్లలకు సంస్కారంతో పాటు మన ఆచారాలు, సంప్ర దాయాలు వివరించాలి. పెద్దలు, తల్లిదండ్రులపై గౌరవం పెంచేవిధంగా వారికి గురువులు బోధించాలి.' అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం వజ్రపుకొత్తూరు మండలం తోటూరు తీరంలో సముద్రానికి ఆమె విష్ణుహారతి ఇచ్చారు. అలాగే, పంచామృతం, పూలతో అభిషేకం చేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి ఆహ్వానం మేరకు ఆమె ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ.. అన్ని నదులు కలిసే సముద్రం విష్ణుమూర్తికి ప్రతి రూపమన్నారు. ప్రపంచం సుభిక్షంగా ఉండాలంటే అన్నంపెట్టే రైతన్నను, శరీరానికి రక్షణ ఇస్తున్న చేనేతన్నను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం రైతులు, చేనేత కార్మికుల దంపతులు, మాజీ మంత్రి గౌతుశివాజీ, విజయమ్మ దంపతులకు పాదపూజచేసి నీటిని తలపై చల్లుకొని వస్త్రాలను సమర్పించారు.


మాజీమంత్రి శివాజీ దంపతులకు వస్త్రాలు అందిస్తున్న జ్యోతిర్మయి, వెంకన్న చౌదరి

కార్యక్రమంలో వెంకన్న చౌదరి తల్లిదండ్రులు, అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, నాయకులు సూరాడ మోహనరావు, బడ్డ నాగరాజు, చిన్ని, కర్ని రమణ, అరసవల్లి ఉమా, ఎంపీటీసీ సురేఖ, డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, నెయ్యిల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బడిఈడు పిల్లల్లో హిమోగ్లోబిన్ రేటు ప్రమాదకర స్థాయికి చేరుకుంటుందని, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వారందరినీ ఆరోగ్యవంతులను చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'బేటీ బచావో - బేటీ పడావో' అంశంపై బుధవారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి, వారిలో హిమోగ్లోబిన్ శాతం, ఎత్తు, బరువు కొలవాలన్నారు. రక్తహీనత గల వారిని గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. బరువు తక్కువగా ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రతీరోజు రెండు చొప్పున ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను విధిగా విద్యార్థినులకు అందించాలని, డీ-వార్మింగ్ టాబ్లెట్లను వేసుకునేలా చర్యలు తీసుకోవాలని, తరచుగా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ ఏడాది డ్రాప్ అవుట్ విద్యార్థినుల సంఖ్య 2245గా నమోదు కావడం ఆందోళనకర విషయమన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించినప్పుడే భవిష్యత్తులో మహిళా సాధికారత సాధ్యమవుతుందని చెప్పారు. డీఎంహెచ్‌వో బి.మీనాక్షి మాట్లాడుతూ.. స్త్రీ పురుష నిష్పత్తిని పెంచేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ.. శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, సోంపేట ఆర్టీసీ బస్టాండ్ల వద్ద పాలిచ్చే తల్లుల కోసం బేబీ ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం అధికారులతో కలసి అత్యవసర ఫోన్ నెంబర్లు, కిశోర బాలికా వికాసం వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రమణ, సెట్శ్రీ సీఈవో ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అయినను.. మారలేదు!


పేరు మారని హెల్త్ క్లినిక్

- రైతుసేవా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లకు మారని పేరు
- పాత పేర్లతో భవనాల కొనసాగింపు.. మారని రంగులు
- దేశవానిపేట విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రమే నివాసంగా..
- నియోజవర్గ రైతు శిక్షణ కేంద్రంలో వైసీపీ జెండా

నరసన్నపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలకు ఇంకా పాతపేర్లు కొనసాగిస్తున్నారు. కూటమి అధికారంలో వచ్చాక గత ప్రభుత్వం హయాంలోని రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు చేసినా.. అక్కడక్కడా పేర్లు మాత్రం మార్పు చేయలేదు. చాలా గ్రామాల్లో అలానే రైతు సేవా కేంద్రాలు దర్శిన మిస్తున్నాయి. అవే రంగులతో అవే అక్షరాలతో కనిపిస్తున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలేజి హెల్త్ క్లినిక్‌లకు కూడా వైఎస్‌ఆర్ పేరు మీద కొనసాగుతున్నాయి. ఆయా శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పంచాయతీ సిబ్బంది కూడా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

వైసీపీ కార్యాలయమా.. రైతు శిక్షణ కేంద్రమా..?

నరసన్నపేట నియోజవర్గంలో రైతులకు ఆధునిక, సంప్రదాయ వ్యవసాయంపై శిక్షణ ఇచ్చేందుకు గత టీడీపీ హయాంలో 2017లో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి రూ.60 లక్షల నాబార్డు నిధులతో పక్కాభవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో రైతులతో పాటు, పాడి రైతులకు కూడా శిక్షణ ఇచ్చేందుకు అన్ని హంగులు ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ భవనం రైతు భరోసా కేంద్రంగా కొన్నాళ్లు విధులు చేపట్టారు. ఈ భవనం పక్కనే కొత్త రైతు భరోసా భవనం నిర్మాణం చేశారు. అయితే దీనికి తాళాలు వేశారు. ఈ భవనం వినియోగంలోకి రాకపోవడంతో పెచ్చులూడుతోంది. బాత్ రూమ్‌లకు తలుపులు విరిగిపోయాయి. వైసీపీ జెండాలతో ఈ భవనం దర్శనమిస్తోంది. రైతులకు శిక్షణ ఇచ్చేందుకు మార్కెట్ కమిటీ కార్యాలయంను వినియోగించడంతో.. ఈ భవనం ఉన్నట్లుగా వ్యవసాయశాఖ అధికారులకే తెలియకపోవడం గమనార్హం.

హెల్త్ సెంటర్‌ను ఇల్లుగా మార్చేసి..

దేశవానిపేటలో గల సచివాలయం పక్కనే మూడేళ్ల క్రితం హెల్త్ క్లినిక్ కేంద్ర భవనాన్ని నిర్మాణం చేసి ప్రారంభించారు. ఇందులో పనిచేసే సిబ్బంది ఒక భాగాన్ని ఏకంగా నివాసంగా మార్చుకుని ఉంటున్నారు. హెల్త్ కేంద్రాలకు ఎవరూ రాకపోవడం.. కేవలం 104 వాహనం వచ్చిన సందర్భంలోనే అక్కడ ఆరుబయటే వైద్యసేవలు అందించడంతో ఆ కేంద్రాన్ని నివాసంగా మార్చుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. నెలనెలా కరెంటు బిల్లు పంచాయతీనే చెల్లిస్తుంది.

పేర్లు మార్పు చేయాలని ఆదేశించాం..

ఆర్‌బీకేలకు రైతు సేవా కేంద్రాలకు పేర్లు మార్పు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఏడీఏ రవీంద్రభారతి తెలిపారు. దేశవానిపేటలో రైతు శిక్షణ కేంద్రం అనేది లేదని, జిల్లా కేంద్రంలో ఉందని, నియోజవర్గస్థాయిలో ఉన్న రైతు శిక్షణా కేంద్రం ఉండదని తెలిపారు. మరి దేశవానిపేట సచివాలయం ప్రాంగణంలో ఉన్న రైతు శిక్షణ కేంద్రం గురించి తెలియదని అన్నారు.


నరసన్నపేట దేశవానిపేట పశువుల ఆసుపత్రి ప్రాంగణంలోని హెల్త్‌క్లినిక్ భవనాన్ని ఇల్లుగా మార్చుకొని ఉంటున్న సిబ్బంది


నరసన్నపేట పట్టణంలో పేరు మారని రైతు సేవాకేంద్రాలు

ఓం నమో భాస్కరాయ


ఊరేగింపుగా ఇంద్రపుష్కరిణి వద్దకు ఆదిత్యుని తీసుకువస్తున్న అర్చకులు



- కమనీయం ఆదిత్యుని తెప్పోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

అరసవల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం, క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారికి బుధవారం తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య పల్లకిపై ఆలయం నుంచి ఇంద్రపుష్కరిణి వద్దకు అర్చకులు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై ఆశీనులను చేసి ఇంద్రపుష్కరిణిలో విహరింపజేశారు. వేలాదిమంది భక్తులు పుష్కరిణిలో స్వామికి మొక్కులు చెల్లించి, కార్తీక దీపాలను విడిచిపెట్టారు. ఓం నమో భాస్కరాయ అన్న నామస్మరణ ఆ ప్రాంతం మార్మోగింది. ఇంద్రపుష్కరిణి వద్ద వైజయంతి కళావేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను పుష్కరిణిలో హంసనావపై 12 ప్రదక్షిణలు చేసిన అనంతరం.. పుష్కరిణి మధ్యలో గల గరుడాళ్వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత అనంతరం స్వామివారికి పుర మాడవీధుల్లో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. తరువాత స్వామివారిని ఆలయ అనివెట్టి మండపంలో ఉంచి అర్చకులు, వేదపండితులు క్షీరాబ్ది వ్రతం చేశారు. ఇందులో భాగంగా నీరాజనం, మంత్రపుష్పం సమర్పణల అనంతరం స్వామివారికి పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఈవో వై.భద్రాజీ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, బీఎస్.చక్రవర్తి, అర్చకులు నేతింటి హరిబాబు, ఇప్పిలి, షణ్ముఖశర్మ, సాందీపశర్మ, రంజిత్‌శర్మ, శ్రీనివాసశర్మ, రామకృష్ణ, యుగంధర్, సాయి, నవీన్, కార్తీక్, మణికంఠ, నీలయ్య పాల్గొన్నారు.


వైజయంతి కళావేదికపై నృత్య ప్రదర్శన


గార: శ్రీకూర్మం శ్వేత పుష్కరిణిలో స్వామివారి విహారం

శ్వేత పుష్కరిణిలో కూర్మనాథుడి విహారం..

గార, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుడి తెప్పోత్సవం (నావికా ఉత్సవం) బుధవారం వైభవంగా జరిగింది. ప్రతిఏటా కార్తీక శుద్ధ ద్వాదశి రోజున ఇక్కడ తెప్పోత్సవం నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు, ఇతర అర్చక స్వాములు, వైదిక స్వాములు సాయంత్రం చక్ర పెరుమాళ్ళ విగ్రహాన్ని పల్లకిపై ఆశీనులను చేసి తిరువీధి శ్వేత పుష్కరిణిలో మూడు సార్లు ప్రదక్షిణ చేయించారు. ఆలయ ఈవో జి.గురునాధరావు ఆధ్వర్యంలో కార్యక్రమంలో జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని తిలకించారు.


ఇంద్రపుష్కరిణి వద్ద భక్తులు

అదుపులో ఉంటే.. భయం లేదు

- జీవనశైలిలో మార్పుల వల్లే షుగర్ వ్యాధి
- క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి
- వైద్యుల సలహాతో మందులు వాడితే మేలు
- నేడు వరల్డ్ డయాబెటిక్ డే



అరసవల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలిలో వస్తున్న మార్పుల వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇది జీవ ప్రక్రియకు, రక్తనాళాలకు సంబంధించిన వ్యాధి. శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి సరిగ్గా జరగకపోవడం లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్‌ను శరీరం సమర్థవంతంగా ఉపయోగించుకోలేక పోవడం వల్ల రక్తంలో చక్కెర శాతం పెరిగి మధుమేహం వ్యాధి వస్తుంది. దేశంలో 77 మిలియన్ల మంది ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారని అంచనా. ఈ సంఖ్య 2025 నాటికి 124 మిలియన్లకు చేరుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. గురువారం వరల్డ్ డయాబెటిక్‌డే సందర్భంగా కథనం..

డయాబెటిస్ రకాలు

ఇది ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి టైప్-1 డయాబెటిస్. ఇది శరీరంలోని పాంక్రియాస్ ఇన్సులిన్‌ను సరిపడనంతగా ఉత్పత్తి చేయకపోవడం వల్ల వస్తుంది. దీని చికిత్సకు ఇన్సులిన్ ఇంజక్షన్లు వాడతారు. ఇక రెండోది టైప్-2 డయాబెటిస్. ఇది ఉత్పత్తి అయిన ఇన్సులిన్‌ను శరీరం సరిగ్గా వినియోగించుకోకపోవడం. దీనిని నోటి ద్వారా తీసుకునే మందులతో అదుపులో ఉంచుకోవచ్చు. దేశంలో 90 శాతం మంది టైప్-2 డయాబెటిక్ కావడం విశేషం.

వ్యాధికి గల కారణాలు

శారీరక శ్రమ తక్కువగా ఉండడం, పగటి నిద్ర, సరైన వ్యాయామం లేకపోవడం, వంశపారంపర్యం, పర్యావరణ కాలుష్యం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, ఆల్కహాల్, ధూమపానం, శీతల పానీయాలు అధికంగా తీసుకోవడం, జంక్ ఫుడ్, శారీరక, మానసిక ఒత్తిళ్లు, భయం మొదలగునవి ఈ వ్యాధికి కారణాలు

దీర్ఘకాలంలో వచ్చే సమస్యలు

అదుపులో లేని మధుమేహం వల్ల దీర్ఘకాలంలో తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మూత్రపిండాలు పనిచేయక పోవడం, పక్షవాతం, గుండెపోటు వచ్చే ప్రమాదం మూడు రెట్లు అధికం, సూక్ష్మ రక్తనాళాల వ్యాధులు, కంటిలో రెటీనా సమస్యలు వచ్చి హఠాత్తుగా దృష్టి కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

నివారణా మార్గాలు

రోజుకు కనీసం గంట నడక లేదా 45 నిమిషాల పాటు వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలి. అలాగే ఆహారంలో ఎక్కువగా పీచుపదార్థాలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవాలి. కంటివైద్య నిపుణుని వద్ద ఏడాదికి ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి. మధుమేహ లక్షణాలు కని పిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత వైద్యుని సంప్రదించాలి. వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు

చక్కెర వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను ఇలా సూచిస్తున్నారు. తక్కువ కొవ్వు శాతం ఉన్న పదార్థాలు, కొవ్వు తీసిన పాలు, గోధుమలు, రాగి, బార్లీ, జొన్న, చిరుధాన్యాలు, సోయా, పొట్లకాయ, మునగ, కాకరకాయ, గోరు చిక్కుడు, మెంతికూర, పాలకూర, పుదీనా, కొత్తిమీర తదితర ఆకుకూరలు తీసుకోవాలి. అలాగే రాగి సంగటి, జొన్న సంగటి, కొర్రలు, సామలు మొదలగు చిరుధాన్యాలు, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవడం, తక్కువ మోతాదులో ఆపిల్, కమల, బొప్పాయి, జామకాయ తీసుకోవాలి. వంటనూనెల్లో వేరుశెనగ, రైస్ బ్రాన్ ఆయిల్ మూడు నెలలకు ఒకసారి మార్చి వాడుకోవాలి. ఆహారంలో పిండి పదార్థాలు తక్కువగా తిని, చిరుధాన్యాలు, ఎక్కువగా తీసుకోవాలి. ప్రోటీన్ కలిగిన శనగలు, బాదం, సోయా చిక్కుడు గింజలు, పెసలు, వేరుశెనగలు ఉడికించి తినడం, వేపుడు పదార్థాలు తగ్గించి తినడం వల్ల చక్కెర వ్యాధి అదుపులో ఉంటుంది. అరచెంచా మెంతులు రాత్రిపూట మజ్జిగలో నానబెట్టి మరుసటి ఉదయాన్నే తీసుకోవాలి. మైదాతో చేసే పదార్థాలు, అధిక చక్కెర, శీతల పానీయాలను దూరంగా ఉంచాలి.

వ్యాధి నిర్ధారణే కీలకం

వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. నివారణలో వ్యాధి నిర్ధారణే అత్యంత కీలకం. తొలి దశలోనే దీన్ని గుర్తిస్తే జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చేయడం ద్వారా రాకుండా చూసుకోవచ్చు. అలాగే సంతోషకర జీవనాన్ని గడపవచ్చు.

- డాక్టర్ సనపల నర్సింహమూర్తి, ఎండీ (జనరల్ ఫిజీషియన్)

జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టాటా స్ట్రయివ్ సౌజన్యంతో బొల్లినేని మెడ్ స్కిల్స్ ఆధ్వర్యంలో జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసున్న విద్యార్థులు అర్హు లన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైనా.. ఫెయిల్ అయిన వారైనా ఈ కోర్సులో చేరవచ్చని చెప్పారు. మూడు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అలాగే డిగ్రీ పాస్ అయిన వారికి పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి కార్పొరేట్ హాస్పటల్స్ లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇంటర్ పాస్ అయినవారికి డిప్లమో పారా మెడికల్ కోర్సు ల్లో ప్రస్తుతం అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అన్నా రు. పూర్తి వివరాల కోసం 7680945357, 912199 9654 ఫోన్ నెంబర్లలో గాని, రాగోలులో 'జెమ్స్' ఆసుపత్రి క్యాంపస్‌లో తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

శ్రీకాకుళం రూరల్ ,నవంబరు 13(ఆంధ్రజ్యో తి): ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన ఉండాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ త్రినేత్రి సూచించారు. బుధవారం ఒప్పంగి హై స్కూల్‌లో చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మందస ఎస్ఐ సస్పెన్షన్

శ్రీకాకుళం క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మందస పోలీసు స్టేషన్ ఎస్ఐ ఖాదర్ బాషాను సస్పెండ్ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. ఇటీవల ఓ బాలిక మిస్సింగ్‌పై బాధితులు ఫిర్యాదు చేసినా పోక్సో కేసు నమోదు చేయలేదు. ఉన్నతాధికారులకు బాధితులు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి ఎస్ఐను సస్పెండ్ చేశారు.

స్విమ్మింగ్ పోటీల్లో 24 పతకాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు 24 పతకాలు సాధించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుప్పల వెంకటరావు అన్నారు. ఈ నెల 10న జరిగిన ఈ పోటీల్లో 21 బంగారు, ఒక రజితం, రెండు కాంస్య పతకాలను సాధించారన్నారు. ఎస్.రాజారావు, శిక్షకుడు షేక్ సుభాన్ ఉన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థుల రెండో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ అధికారులు బుధవారం విడుదల చేశారు. బీఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ, బీవీహెచ్ కోర్సుల్లో మొత్తం 7,785 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఇందులో 2,925 మంది ఉత్తీర్ణులై 37.57 శాతం ఫలితాలు నమోదయ్యాయి. పరీక్ష ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్లో అందుబాటులో ఉంచామని ఇన్‌చార్జి డీన్ జి.పద్మారావు తెలిపారు. ఫలితాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా 15రోజుల్లోగా పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏఎస్పీగా రమణ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 12మంది ఏఎస్పీలకు బుధవారం బదిలీలు అయ్యాయి. ఈ మేరకు శ్రీకాకుళం ఏఎస్పీ (అడ్మిన్)గా ఉన్న ప్రభాకర్‌బాబుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న కేవీ రమణను నియమిస్తూ డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

గార, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కూటమి నాయకులు మైగాపు ప్రభాకరరావు, గోర సురేష్, వీఎస్‌గిరి తదితరులు కోరారు. ఈ మేరకు విద్యుత్ ఎస్ఈకి వినతి పత్రం అందజేశారు. అలాగే ఖాళీగా ఉన్న లైన్‌మెన్ పోస్టు భర్తీ చేయడంతోపాటు ఏళ్ల కిందట వేసిన విద్యుత్ లైన్లు, స్తంభాలు మార్చించాలని కోరారు.

జాతీయ పోటీలకు ఎంపిక

ఎచ్చెర్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినులు ఎం.మౌనిక, ఎస్.జీవిత ఎంపికపై క్యాంపస్ డైరెకర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ కొర్ల మోహనకృష్ణ చౌదరి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం (ఐటెప్)లో మిగులు సీట్ల భర్తీకి గురువారం నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులే ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు.

55 మంది విద్యార్థుల ఎంపిక

గుజరాతీపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గల కాకినాడ ఆదిత్య కళాశాలలో ఫార్మ కంపెనీ హెటిరో డ్రగ్స్ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన 55 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో డిగ్రీతో పాటు ఉద్యోగం సాధించేందుకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఐదో సెమిస్టర్‌లో విద్యార్థులు ఉండగానే బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు రావడం సంతోషకరమన్నారు. కళాశాల కార్యదర్శి సుగుణా రెడ్డి మాట్లాడుతూ.. ఈ కళాశాలలో విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే క్యాంపస్ ఇంటర్వ్యూలకు తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జీజీవీ సుబ్రమణ్యం, ప్లేస్‌మెంట్ అధికారి ఆర్.రాజు, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన కాకినాడ ఆదిత్య కళాశాల విద్యార్థులు

అవగాహన కల్పించాలి

గుజరాతీపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టంపై విస్తృతస్థాయిలో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రిటైర్డు ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముక్తకంఠంతో కోరారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ సమావేశ మందిరంలో బుధవారం జిల్లాస్థాయి వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి నర్తు కల్యాణ్‌బాబు, మానసిక ఆరోగ్య నిపుణురాలు అఖిల, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు .కవిత, రిటైర్డు డీఈవో బి.మల్లేశ్వరరావు, న్యాయ వాదులు పాల్గొన్నారు.

సందడిగా తెప్పోత్సవం



నాగావళి నదికి హారతి ఇస్తున్న మహిళలు



నదిలో తెప్పోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో బలగ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం మణిగంగ పుష్కరిణిలో అర్చకులు దేవరకొండ శంకర్‌నారాయణ శర్మ ఆధ్వర్యంలో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలుచే దీపారాధన చేయించారు. అదేవిధంగా కలెక్టర్ బంగ్లా వద్ద గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చిలుక ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. నాగావళి నదిలో శ్రీదేవి భూదేవి సమేతంగా మలయప్ప స్వామి వారి తెప్పోత్సవం నిర్వ హించారు. నాగావళి నదికి మాతృకాహారతి ఇచ్చారు. కార్యక్రమాన్ని బెహరా నాగేశ్వరరావు మర్రి యోగేశ్వరరావు, ఎల్.నందీకేశ్వరరావు, తదితరులు ఏర్పాటు నిర్వహించారు.

టోల్ ఫ్రీ నెంబరుతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం



వినియోగదారులతో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్

ఇచ్ఛాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డు జిల్లా న్యాయాధికారి బి.సత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు విద్యుత్ వినియోగం, సమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు ఇచ్ఛాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 11 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

- కంచిలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మఖరాంపురం పంచాయతీ పరిధిలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీడీపీ నాయకులు తమరాల శోభన్‌బాబు ఇచ్ఛాపురంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

బూర్జ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ప్రవల్లిక అన్నారు. తోటవాడ గ్రామాన్ని బుధవారం ఆమె సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఇస్తే వాహన యజమానులకు చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఫోన్‌లో బ్యాంకు అకౌంట్ నెంబర్లు, ఏటీఎం పిన్ నెంబర్లు అడిగితే ఇవ్వొద్దని సూచించారు.

పీఎం ఫసల్ బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని జిల్లాలోని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి త్రినాథస్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటల దిగుబడిపై ప్రభావం చూపే నష్టాల నుంచి రైతులను రక్షించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం తెలిచ్చిందని, వచ్చే నెల 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు

కంచిలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయవాడ, కర్నూల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి పోటీల్లో కంచిలి ఏపీ స్టేట్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. వాలీబాల్‌లో వై.ధనుష్ బంగారు పతకం, జావెల్ త్రోలో కె.యాదగిరి సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో వీరిని ప్రిన్సిపాల్ పైల గణపతి బుధవారం పాఠశాల ఆవరణలో అభినందించారు.

ఎమ్మెల్యేకు పదవిపై హర్షం

కంచిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు ప్రభుత్వ విప్ గా నియమించడంపై మండల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పెద్ద కొజ్జిరియా లో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ సర్పంచ్ బొడ్డ రామకుమార్, పి తిరుమలరావు, బి.పృథ్వీబాబు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పనులు చేపట్టాలి

లావేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లోను ఇంకుడు గుంతలు పనులు త్వరిగ చేపట్టాలని ఎంపీడీవో వెంకటరాజు తెలిపారు. బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

పనితీరు మెరుగుపరుచుకోండి: జేసీ



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

టెక్కలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం వీడి పనితీరు మెరుగుపరుచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు విధులకు వచ్చినప్పటి నుంచి సాయంత్రం వరకు ఏం పని చేస్తున్నారో గమనించుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం వినతులపై అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సర్వీసులు, పెండింగ్ కోర్టు కేసులు నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థులకు బర్త్ సర్టిఫికేట్లు త్వరితగతిన జారీచేయాలన్నారు. అనంతరం గృహ నిర్మాణశాఖ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల ప్రత్యేకాధికారులతో గృహ నిర్మాణంపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో లేఅవుట్ల వారీగా ఆరా తీశారు. ప్రతి ఒక్క అధికారి మూడు ఇళ్లకు వెళ్లి లబ్ధిదా రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కొట్లాట కేసులో ఆరుగురి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ అవతారం

రణస్థలం/జి.సిగడాం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం గ్రామంలో ఇటీవల భూ వివాదంలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈ ఘటనలో నాయిన సూర్యనారాయణ, వెంకటరావుపై అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడికి పాల్పడిన ఆరు గురిని అరెస్టు చేసినట్టు జేఆర్ పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వివరాలు వెల్లడించారు. జి.సిగడాం రెవెన్యూ పరిధిలో కోర్టు వివాదంలో ఉన్న భూమిపై సోమవారం అదే గ్రామానికి చెందిన నాయిన శివన్న, ఎన్.లక్ష్మణరావు, ఎన్.సీతంనాయుడు, ఎన్.శంకరరావు, ఎన్.గోపి, ఎన్. రాజు నీరు కట్టే పయత్నం చేశారని, కోర్టు వివాదంలో ఉన్న భూమి పైకి ఎందుకు వచ్చారంటూ ప్రశ్నించిన నాయిన సూర్యనారాయణ, వెంకటరావుపై వారంతా కత్తులు, కర్రలతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు జి.సిగడాం ఎస్‌ఐ వై.మధుసూదనరావు దాడికి పాల్పడిన ఆరుగురుని అరెస్టు చేసి పొందూరు కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. దీంతో వారిని అంపోలులోని జిల్లా జైలుకి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు సమావేశంలో జేఆర్ పురం ఎస్‌ఐ చిరంజీవి, జి.సిగడాం ఎస్‌ఐ వై.మధుసూదనరావు పాల్గొన్నారు.

పరారీలో ఓ ప్రైవేట్ చిట్స్ మేనేజర్

- న్యాయం కోసం బాధితుడి పడిగాపులు

శ్రీకాకుళం క్రైం, నవంబరుర్ 13(ఆంధ్రజ్యోతి): చిట్ పేరుతో వేధింపులకు పాల్పడుతూ, చిట్టిదారుల ఇంటికి వెళ్లి పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించిన కేసులో ఓ ప్రైవేట్ చిట్స్ మేనేజర్ ఆర్.మణికంఠ పరారీలో ఉన్నట్టు రెండో పట్టణ పోలీ సులు చెబుతున్నారు. సీఐ ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 9న ప్రకాష్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న దంపతులు కరకవలస రమ, సత్యనా రాయణపై ఆ సంస్థ మేనేజర్ మణికంఠ పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారని బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మణికంఠ నేటికి ఆచూకీలేదని, ప్రస్తుతం అతడి కోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు. కేసు కట్టి ఐదురోజులు గడుస్తున్న మేనేజర్ స్టేషన్‌కు రాకపోగా.. ఆ సంస్థ డీఎం, సిబ్బందితో పోలీసు స్టేషన్ వద్ద రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ వైపు బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతుంటే కేసు వాపసు తీసుకోమని ఆ సంస్థ ప్రతినిధులు బాధితులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. పోలీసులు సైతం బాధితులను పిలిపించి విచారిస్తున్నారే తప్పా.. మేనేజర్ మణికంఠను, అతడి తో వచ్చిన ముగ్గురుని ఇంత వరకు స్టేషన్‌కు తీసుకురాలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణికంఠ సెల్‌ఫోన్లోనే కథంతా నడిపిస్తున్నాడని, పోలీసులు అతడి జాడ తెలియదని చెప్పడం నమ్మశక్యంగా లేదంటూ బాధితులు ఆరోపిస్తున్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

ఎల్.ఎన్.పేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు సంబంధించి గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్‌ఐ జానకి కావ్య తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని ఐదు గ్రామాల్లో మద్యం అమ్ముతున్న ఐదుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఒకసారి బైండోవర్ నమోదైన వారు రెండోసారి మద్యంతో దొరికితే అటువంటి వారికి రూ.లక్ష జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు.

రైలుకింద పడి వృద్ధురాలి మృతి

కోటబొమ్మాళి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో రైలు కిందపడి సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఫ్లైఓవర్ సమీపంలో సుమారు కిలోమీటన్నర దూరంలో వృద్ధురాలు కర్రసాయంతో నడుచుకుంటూ వెళ్లి రైలుకింద పడింది. అక్కడకు సమీపంలోనే ఒడిశాకు చెందిన రైల్వే కార్మికులు పనులు చేస్తున్నారు. వారి మధ్యలో నుంచే ఆమె వెళుతున్నప్పుడు వారు తాగేందుకు నీరి చ్చారు. అయితే కొద్ది సేపటికే ఆమె పలాస నుంచి ఆమదాలవలస వైపు వెళుతున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడం వారిని కలిచివేసింది. ఉదయం 10గంటల సమయంలో ఆత్మహత్యకు పాల్పడి నప్పటికీ సాయంత్రం వరకు బంధువులు గాని, రైల్వే పోలీసులు గాని రాలేదని అక్కడి వారు చెబు తున్నారు. ఆమె ముక్కుచెవులకు బంగారు ఆభరణాలున్నాయి. పూల చీర ధరించి ఉంది. ఈమెకోటబొమ్మాళి చాకలివీధికి చెందిన వృద్ధురాలిగా భావిస్తున్నారు. ఆత్మ హత్యకు కారణాలు తెలియరాలేదు. గ్యాంగ్‌మన్ రైల్వేశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. పలాస జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి ..



శ్యామ్ (ఫైల్)

కంచిలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జలంత్రకోట కూడలి వద్ద హైవేపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీ సులు తెలిపిన వివరాల మేరకు.. సోంపేట మండలం పాలవలస పంచాయతీ కుమ్మరిపాడు గ్రామానికి చెందిన కాళ్ల శ్యామ్ సుందర్(35) కంచిలి మండలం గొల్లపుట్టుగ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాడు. మృతుడికి భార్య త్రివేణి, ఐదేళ్ల కుమార్తె హాస్విత ఉన్నారు. త్రివేణి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సోంపేట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించారు.

సారా కేసులో ముగ్గురి అరెస్టు

సోంపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తూ పట్టుబడిన రెండు కేసుల్లో ముగ్గురుని అరెస్టు చేసినట్టు సీఐ కె.బాబీ తెలిపారు. శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా 18.2 లీటర్ల సారా సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి..

ఆమదాలవలస, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బైరివానిపేట గ్రామానికి చెందిన కేశవరావు అనే వ్యక్తి ఎనిమిది మద్యం సీసాలు తరలిస్తూ పట్టుబడినట్టు ఎక్సైజ్ సీఐ సతీష్ కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వయోడెక్ట్ బ్రిడ్జి వద్ద బుధవారం అతడిని పట్టుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను ఎల్ఎన్ పేట తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు తెలిపారు.

ఏఎస్‌ఐ సస్పెన్షన్‌తో పోలీసుల ఉలికిపాటు

టెక్కలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టెక్కలి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పని చేస్తున్న పి.నర్సింగరావు సస్పెన్షన్‌కు గురికావడంతో పోలీసులు ఉలికిపాటుకు గురయ్యారు. ఓ గ్రానైట్ వ్యాపారి నుంచి డబ్బులు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి ఎస్పీ మహేశ్వరరెడ్డి సదరు ఏఎస్‌ఐని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఏఎస్‌ఐ నర్సింగరావుకు భాషతో పాటు వాక్చాతుర్యం ఉండడంతో రైటర్‌గా ఉంటూ కిరికిరిలకు పాల్పడేవారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల లింగాలవలస పంచాయతీ సతివాడ సమీపంలో ఓ గ్రానైట్ క్వారీకి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణలో విధి నిర్వహణకు వెళ్లిన నర్సింగరావు ఆ క్వారీ యాజమాన్యం వద్ద స్టేషన్ ఖర్చులంటూ రూ.ఐదు వేలు తీసుకున్నాడనే విషయం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం, దీనిపై వివరాలు సేకరించిన పోలీస్ బాస్ ఆయనపై వేటు వేసిన సంగతి తెలిసిందే.

రైలుపై నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

సంతబొమ్మాళి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి బుధవారం జారిపడి గాయపడ్డాడని పలాస రైల్వే ఎస్‌ఐ ఎస్.ఏ.షరీఫ్ తెలిపారు. అతనికి చికిత్స నిమిత్తం కోటబొమ్మాళి ఆసుపత్రికి తీసుకువెళ్లారని, అపస్మారక స్థితిలో ఉండడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించారన్నారు. అతని వయసు సుమారు 35 సంవత్స రాలు ఉంటుందని, వివరాలు సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఆయన తెలిపారు.

నేటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మందస/పలాసరూరల్/నందిగాం,నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాలయాల్లో గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారులు కె.విజయలక్ష్మి, వై.రాంబాబు, ఎస్.ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, యువతకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందిస్తామన్నారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

వినతుల పరిష్కారంపై శ్రద్ధ

పలాసరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్డీవో గ్రంధి వెంకటేష్ అన్నారు. కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌పై బుధవారం తహసీల్దార్, డీటీలు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రజలు ఇచ్చే వినతులకు కచ్చితమైన సమాచారం అందించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బొమ్మలు అందజేత

హిరమండలం,నవంబరు13:(ఆంధ్రజ్యోతి) హిరమండలం నౌగూడ అంగన్‌వాడీ కేంద్రానికి జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు బుధవారం ఆట బొమ్మలను అందించారు. ఇప్పటికే సొంత నిధులతో ఈ కేంద్రానికి విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. మండ లంలో మరికొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాలు లేవని వీటిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

పలాసరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పలాస ఎస్సీ పోస్టుమెట్రిక్ బాలుర వసతిగృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గణపతి, ఎస్ఎఫ్ఐ సంఘ నాయకులు టీఎం రాజు, ఎన్.దర్మారావు, పి.మదు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్‌లో ఇద్దరికి చోటు



గురజాపు రాము, వి.దుర్గారావు

శ్రీకాకుళం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రజక కార్పొ రేషన్ మెంబర్లుగా జిల్లాకు చెందిన ఇద్దరు కూటమి నాయకులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రణస్థలం మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త గురజాపు రాము, వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన జనసేన నాయకులు వి.దుర్గారావు రజక కార్పొరేషన్ మెంబర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

శానిటరీ మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో శానిటరీ మేస్త్రీలుగా పని చేస్తున్న ముగ్గురిని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగిం చడం అన్యాయమని, వారిని తక్షణం విధుల్లోకి తీసుకో వాలని మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద బుధవారం పారి శుధ్య కార్మికులు సమ్మె చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. శానిటరీ మేస్త్రీలుగా పని చేస్తున్న మోహన్ కృష్ణ, ఉపేంద్ర, రాములను అన్యాయంగా తొలగించారన్నారు.వీరికి ఇంజనీరింగ్ కార్మిక సంఘ కార్మికులు మద్దతు తెలిపారు. మున్సిపల్ మేస్త్రీల సంఘ నాయకులు రామారావు, అల్లు రవి, కలగ జగదీష్ పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు నిధులివ్వండి

పలాస, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధులతో పాటు గిరిజన ప్రాంతాల్లో ప్రబలుతున్న ప్రాణాంతక వ్యాధులను అరి కట్టేందుకు తగిన నిధులివ్వాలని పలాస నియోజకవర్గ జనసేన కన్వీనర్ దుర్గారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి ఉద్దానం కిడ్నీ వ్యాధులపై చర్చించారు. వ్యాధి తీవ్రతలను గుర్తించి తగిన సలహాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పలాస, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో పారిశుధ్యం మెరుగుకోసం చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్.రామారావు తెలిపారు. పారి శుధ్య విభాగానికి 42 పుష్‌కార్టులు, 22 డంపర్ బిన్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురానున్నామన్నారు. బుధవారం పరికరాల మరమ్మతులు చేస్తున్న వర్క్‌షాప్‌ను సందర్శించారు. ఆయనతో పాటు పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

ప్రజలతో పోలీసులు మమేకం కావాలి

- డీఎస్పీ వెంకట అప్పారావు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

వజ్రపుకొత్తూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలతో పోలీసులు మమేకమై మైత్రీ పోలీసింగ్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారి సమస్యలను పరిష్కరించాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు అన్నారు. బుధవారం వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పెండింగ్ కేసుల పురోగతి, మండల స్థితిగతులపై ఆరా తీశారు. స్టేషన్‌ను పరిశీలించి భవనాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, కేసులను పరిష్కరించేలా పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. తీరప్రాంతం అధికంగా మండల పరిధిలో ఉన్నందున అపరిచితులపై నిఘా ఉంచాలని, గ్రామాల కూడళ్లలో తరచూ తనిఖీలు చేయాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతి రావు ఎస్‌ఐ నిహార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అపరాల సాగుపై అవగాహన కలిగించండి

- జేడీఏ కె.త్రినాథస్వామి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి

నరసన్నపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో నూనెగింజలు, అపరాల సాగుపై రైతులు శ్రద్ధ వహించేలా వారికి అవగాహన కలిగించాలని వ్యవసాయశాఖ జేడీ కోరాడ త్రినాథస్వామి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నాలుగు మండలాల వీవోఏలకు ఆత్మ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో ఏవిధంగా అధికంగా పంటలను పండించాలనే విషయమై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రబీలో మొక్కజొన్న, నూనెగింజలు, అపరాలు, చిరుధాన్యాల సాగు చేసేలా చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్త చిట్టిబాబు, ఏఆర్‌సీ ఏడీఈ కృష్ణారావు, ఏడీఏ రవీంద్రభారతి, ఏవోలు సునీత, చిరంజీవి పాల్గొన్నారు.

పుచ్చ ఈశ్వరరావుకు పదవిపై హర్షం



ఈశ్వరరావును అభినందిస్తున్న వెంకన్నచౌదరి

వజ్రపుకొత్తూరు,నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండల టీడీపీ సీనియర్ నాయకుడు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావుకు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. హర్షం ప్రకటించిన వారిలో నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, మాజీ ఎంపీపీ గొరకల వసంతస్వామి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, చినవంక సర్పంచ్ దువ్వాడ విజయలక్ష్మి, దువ్వాడ హేమబాబుచౌదరి, గోవిందు పాపారావు, దున్న షణ్ముఖరావు, చింత నారాయణ,గోపి, దున్న నారాయణరావు ఉన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

పలాస, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నియమించిన కార్పొరేషన్ల డైరెక్టర్లు బాధ్యతాయుతంగా పని చేయాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, పార్టీ పలాస ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. కాళింగ, అగ్నికుల క్షత్రి కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన భావన దుర్యోధన, కుత్తుమ లక్ష్మణరావు, పుచ్చ ఈశ్వరరావులను స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం అభినందించారు. నూతనంగా నియమితులైన డైరెక్టర్లు మాజీమంత్రి శివాజీని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, దువ్వాడ హేమబాబుచౌదరి, ఎం.నరేంద్ర (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక పార్కు మంజూరు చేయండి

- మంత్రిని కోరిన ఏపీటీపీసీ చైర్మన్ 'వజ్జ'



ఎమ్మెల్యే శిరీషను సత్కరిస్తున్న వజ్జ బాబూరావు, సంస్థ ఉద్యోగులు

పలాస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు అనుకూలమని, పారిశ్రా మిక పార్కును మంజూరు చేయాలని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూ రావు కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి భరత్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఇప్పటికే సుమారు 200 పైగా జీడి పరిశ్రమలు పెట్టి వేలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్నారన్నారు. కొత్తగా ఎంఎస్‌ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తే వ్యాపారులందరికీ పరిశ్రమలు పెట్టుకునే అవకాశం కలుగు తుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీటీపీసీ కార్యాలయాన్ని సందర్శించిన శిరీష

పలాస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఉన్న ఏపీట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంస్థ చైర్మన్ వజ్జ బాబూరావు ఆహ్వానం మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెను బాబూరావు సత్కరించారు. అనంతరం రాష్ట్రంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ తీసుకోవాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

పాముకాటు మృతిపై ప్రత్యేకాధికారి విచారణ

పొందూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పొందూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన కోళ్ల సూర్యనారాయణ మృతి చెందినట్టు అతడి కుమారుడు చక్రపాణి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో డీసీహెచ్‌ఎస్ ఆదేశాలతో బుధవారం విచారణాధికారి నాగభూషణరావు పీహెచ్‌సీని సందర్శించి ఇరు వర్గాల నుంచి వివరాలు సేకరించారు. గతేడాది సెప్టెంబరు 16న పొలం లో పాముకాటుకు గురైన సూర్యనారాయణను పొందూరు ప్రభుత్వ ఆసుపత్రికి అతడి కుమారుడు చికిత్స కోసం తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో ఉన్న స్టాఫ్‌నర్స్ ఎఫ్ఎన్‌వోతో చికిత్స చేయించి, కనీసం పాముకాటు ఇంజక్షన్ కూడా ఇవ్వకుండా శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ క్రమంలో మార్గ మధ్యంలోనే పరిస్థితి విషమించి అతడు మృతిచెందాడు. దీనిపై చక్రపాణి కలెక్టర్‌కు, డీసీహెచ్‌ఎస్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేయించారు. దీనిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో అప్పటి సూపరింటెండెంట్ రామదాస్‌కు, డ్యూటీ డాక్టర్ సుజాత, స్టాఫ్‌నర్సు లక్ష్మిలకు చక్రపాణి లీగల్ నోటీసులిచ్చారు. దీనిపై డాక్టర్ సుజాత వివరణ ఇవ్వడంతో సంతృప్తి వ్యక్తం చేసిన మృతుడి కుటుంబసభ్యులు మిగిలిన ఇద్దరు స్పందించక పోవడంతో మరోసారి డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఎటువంటి విచారణ చేయకుండా ఏకపక్షంగా డ్యూటీ డాక్టర్ సుజాతపై చర్యలు తీసుకున్నారు. మిగిలిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతో చక్రపాణి విజయవాడలోని ఆరోగ్య శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో జరిగిన విచారణకు సంబంధించిన ఏటీఆర్ ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరణ ఇచ్చిన డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకున్నా మిగిలిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో వివరణ ఇవ్వాలని విచారణ అధికారిని కోరారు. అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ రామదాస్‌కు సిబ్బందిపై నియంత్రణ లేకపోవడమే ఘటనకు కారణమని ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల నుంచి వివరణ తీసుకున్న విచారణాధికారి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు.

రీ సర్వే చేయాలి

సంతబొమ్మాళి, నవంబరు 13(ఆంధ్ర జ్యోతి): మేఘవరం, మరువాడ పంచాయతీల్లో భూముల రీసర్వే చేసి రైతులుకు న్యాయం చేయాలని డీఆర్వో వెంకటేశ్వర రావును కోరారు. ఈ మేరకు టీడీపీ మండల మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, వంకల సోమశ్వరరావు బుధవారం ఆయన ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ రెండు పంచాయతీల్లో రైతులుఅధీనంలో ఉన్న జిరాయితీ భూములు వెబ్‌ల్యాండ్‌లో ఉండిపోవడం వల్ల 1-బి రావడం లేదని, దీంతో రైతులు రుణాలు, ఇతర సౌకర్యాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

న్యూస్ బాక్స్

టెక్కలి డీఎస్పీగా వీఎస్ఎన్ మూర్తి

టెక్కలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టెక్కలి డీఎస్పీగా వీఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'టెక్కలి డీఎస్పీ పోస్టు భర్తీ అయ్యేనా?' కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు ఈ పోస్టు భర్తీకి చర్యలు చేపట్టారు. వీఎస్ఎన్ మూర్తి ప్రస్తుతం ఏసీబీ డీఎస్పీగా పని చేస్తుండగా ఆయనకు టెక్కలి డీఎస్పీగా అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన గతంలో ఇక్కడ ఎస్ఐగా, సీఐగా కూడా ఇక్కడ పనిచేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, నవంబరు 13: నరసన్నపేట పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, ఏఈ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నరసన్నపేట, సత్యవరం, బొరిగివలస, జమ్ము, తామరాపల్లి, ఈదులవలస, కంబకాయి, టెక్కలిపాడు, దూకలపాడు, గొట్టిపల్లి, చల్లబంద, చీడివలస, జదూరు, పిరువాడ, యాట్లబసివలస తదితర గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామన్నారు. గమనించి సహకరించాలని వారు కోరారు.

'ఆఫ్‌షోర్'పై చిన్నచూపెందుకు?'

కాశీబుగ్గ, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వానికి చిన్నచూపెందుకని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ప్రశ్నించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రచార కరపత్రానికే పరిమితమైందన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి చాపర వేణుగోపాల్, సీహెచ్ రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

పలాసరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాపట్లలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బొడ్డపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.భాగ్యరాజ్, వంకల మోహన కృష్ణ విజేతలుగా నిలిచారు. రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రథమ స్థానం పొందారని హెచ్‌ఎం వీరరాజు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని హెచ్‌ఎంతో పాటు పీడీ సీహెచ్.రాంజీ, ఉపాధ్యాయులు అభినందించారు.

నౌపడ విద్యార్థులు..

సంతబొమ్మాళి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో నౌపడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగిన అండర్-14 కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టు విజయం సాధించగా అందులో చిదపాన గౌరీ స్వరూప్, గిన్ని శంకర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. అలాగే బాలికల విభాగంలో కోట వసుంధర జిల్లా జట్టులో ఉన్నారు. అలాగే కడప జిల్లా రాయచోటిలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలు బాలికల విభాగంలో రెండోస్థానం పొందిన జట్టులో పి.ఖగేశ్వరి, యు.పవిత్ర ప్రాతినిధ్యం వహించారని హెచ్‌ఎం తెలిపారు.